క్లుప్తంగా

ఎన్నిక


అబ్దుల్ ఖాదర్

జనగామ : జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఏరియా మజీద్ ఈ బిలాల్ మసీద్ నూతన అధ్యక్షుడిగా ఎండీ అబ్దుల్ ఖాదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మసీద్‌లో మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, ఎండీ గౌస్ మొహినొద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎండీ షరీఫ్, కోశాధికారిగా ఎండీ మీరాజ్ బాబా ఎన్నికయ్యారు. దస్తగిరి, తాజుద్దీన్, జహీర్ అహ్మద్, బాబర్, హమీద్, అడ్వకేట్ జమాల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల చేయూత



నర్మెట : మండల కేంద్రానికి చెందిన ప్రజ్ఞాపురం కనకయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు 1990–91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ బ్యాచ్‌లో ఎవరికి ఏ ఆపద వచ్చినా తమ వంతు సాయం అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్టు నరికిన వ్యక్తిపై కేసు

సాక్షి స్పందన

బచ్చన్నపేట : మండలంలోని కాశీనగర్‌లో చెట్టు నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ పొన్న శ్రీశైలం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాశీనగర్‌లో అధికారుల అనుమతి లేకుండా చెట్టు నరికిన వ్యక్తిపై అటవీశాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా 'అక్రమంగా చెట్టు నరికివేత' అనే సాక్షి కథనానికి అధికారులు స్పందించి, చర్యలు తీసుకున్నారు. మండలంలో ఏలాంటి అనుమతి లేకుండా రోడ్ల వెంట ఉన్న చెట్లను నరికితే శాఖ పరంగా చర్యలు తప్పవన్నారు.

గొడుగుల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ కుమార్తె వర్షిణి జన్మదినం సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మంజుల, కొలిపాక ఈశ్వర్‌ప్రసాద్, జానీపాషా, వేణు, చింత వినయ్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'చేనేత సమస్యలు ప్రస్తావించాలి'

బచ్చన్నపేట : చేనేత కార్మికుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు మచ్చ సందీప్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి పలు సమస్యలను విన్నవించామన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన వివరాలు, బీమా, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామన్నారు. కార్మికులకు వయోపరిమితి లేకుండా బీమా, పెన్షన్ వర్తింపచేయాలని, కళ్యాణ లక్ష్మి పథకంలో నేతన్నలు తయారు చేసిన పట్టు చీరలను ఇప్పించి ప్రోత్సహించాలని, పలు సమస్యలను ఎమ్మెల్సీ మల్లన్న శాసనమండలి సమావేశాల్లో సభ దృష్టికి తీసుకురావాలని కోరామని ఆయన పేర్కొన్నారు.

పరామర్శ

కొడకండ్ల : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన కొత్తపల్లి మల్లమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కాగా కాంగ్రెస్ మండల నాయకులు పరామర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి అంజయ్య నాయకులు సునీల్‌రెడ్డి, ఖలీం, శ్రీకాంత్, వెంకన్న, మధు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల : మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జక్కి నర్సయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. కాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదివారం ఆయనను పరామర్శించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

పాలకుర్తి : బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు యువజన సంఘం నాయకుడు, ఎర్రబెల్లి దయాకర్‌రావు వీరాభిమాని లకావత్ సురేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లుగా తాను చేసిన సేవలను బీఆర్‌ఎస్ నాయకుడు గుర్తించలేదని అన్నారు. గిరిజన జాతి బిడ్డలను గుర్తింపు లేనందుకు నిరసనగా రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

ముసురుతో పత్తికి ముప్పు

- పత్తి సాగుకు పెట్టుబడి భారం
- ఎర్రబారుతున్న మొక్కలు, నిలిచిపోయిన పంట ఎదుగుదల
- ఆందోళనలో పత్తి రైతులు


ముసురు వర్షాలతో ఎదుగుదల లేని పత్తి చేను

జఫర్‌గఢ్ : కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలతో పత్తి పంట సాగుకు పెట్టుబడి భారం రెట్టింపు అవుతోంది. దీనికి తోడు పత్తి మొక్కలు ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానాకాలంలో మండలంలో 12,200 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఇందులో ఎక్కువ శాతం రైతులు వర్షాధారం పైనే ఆధారపడి పత్తిని సాగు చేశారు. పంట సాగు చేసిన మొదట్లోనే తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పత్తి మొక్కల్లో సరైన ఎదుగుదల లేకుండా పోయింది. దీనికి తోడు ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వల్ల పత్తి పంటకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. మొక్కలు ఎర్రబారడంతో పాటు ఎదుగుదల నిలిచిపోయింది. ఇప్పటికే రైతులు దుక్కుల నుంచి మొదలుకొని విత్తనాలు, కలుపు, ఎరువులు, పురుగుల మందులు రెండు నుంచి మూడు దఫాలుగా వేశారు. ఒక్కో ఎకరాకు కనీసం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఒక వైపు పెట్టుబడులు పెరగడంతో మరో వైపు పంట దిగుబడి కన్పించకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. పైగా పంట చేతికి అందివచ్చే వరకు పెట్టుబడి భారం మరింత రెట్టింపు కానుండడంతో పంట దిగుబడి ఏమో కానీ కనీసం పెట్టిన పెట్టుబడులైన వస్తాయో, లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ముసురు వర్షాలతో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడం వల్ల పత్తి మొక్కలు ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోతుంది. వీటి నివారణకు నీళ్లల్లో కరిగే పోషక విలువలు గల ఎరువులను ఉపయోగించాల్సి ఉంటుంది. కాఫర్ అక్సిక్లోరైడ్, 15-15-15, 19-19-19, 13-0-45 సంబంధించిన ఎరువులను రైతులు పత్తి మొక్కలకు పిచికారీ చేసినట్లయితే ఉపయోగకరంగా ఉంటుంది.

– చంద్రన్‌కుమార్, ఏఓ

రెండెకరాల్లో సాగుచేశా..



రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఇప్పటి వరకు ఎకరాకు రూ.12వేలు ఖర్చు అయ్యాయి. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడం వల్ల మొక్కల్లో ఎదుగుదల తగ్గిపోయింది. దీనికి తోడు కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మొక్కలు ఎర్రబారడంతో పాటు ఎదుగుదల ఆగిపోయింది. వచ్చిరాని వర్షాలతో పెట్టుబడుల భారం పెరుగుతున్నాయి. అధికారులు సలహాలు ఇవ్వాలి.

– అన్నెపు ప్రభాకర్, తమ్మడపల్లి (జి), రైతు

సంఘం బలోపేతానికి పాటుపడాలి


యాదగిరిని సన్మానిస్తున్న నాయకులు

బచ్చన్నపేట : ఎస్టీ కుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మానుపాటి యాదగిరి(నర్సింహులు) అన్నారు. ఆదివారం మండల ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యాదగిరిని మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామస్తులు, నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఎస్టీ కులస్తులు ఆర్థికంగా, విద్యాపరంగా ఎదగాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, మండల యువజన నాయకులు క్లైం రమేష్, బెజగం నరేష్, రామగళ్ల సంతోష్, కుండి సిద్దులు, వెంకటనర్సయ్య, అంజన్ కుమార్, రాజు, భాను, సాయి, శివ పలువురు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కొడకండ్ల : స్థానిక సమరానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేగ రామ్మోహన్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్థానిక కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ బలం పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తాత్సారం చేస్తోందన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ దుబ్బ రాజశేఖర్‌గౌడ్, నాయకులు కోటేశ్వర్‌రావు, సోమన్న, శ్రీను నాయక్, అంజనేయులు, ప్రకాశ్, రామకృష్ణ, ఉపేందర్, లక్ష్మణ్, సంపత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పాలకుర్తిలో మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా నాయకుడు కర్ర శ్రీనివాస్ రెడ్డి, రాణా ప్రతాప్, కొడిశెల యాదగిరి, సమ్మయ్య చారి, సైదులు, ఉపందర్, సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

బురద రోడ్డుపై నాటు వేసి నిరసన


నాటు వేసి నిరసన తెలుపుతున్న స్థానికులు

జనగామ : జనగామ–సూర్యాపేట రహదారి కలెక్టరేట్‌కు ఎదురుగా బురదమయంగా మారిన దుర్గా కాలనీలో ఆదివారం స్థానికులు నాటు వేసి నిరసన తెలిపారు. మణి ఐరన్ మర్చంట్ షాపు నుంచి బానోత్ తుకారాం ఇంటి ఏరియాలోని మూడో రోడ్డు వరకు చిత్తడిగా మారింది. అలాగే కాలనీలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కాలనీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు.

సన్మానం


అభిషేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన వేముగంటి అభిషేక్ ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో ఉత్తమ ప్రతిభతో ఇటీవల 42వ ర్యాంకు సాధించాడు. దీంతో పాటు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ నేషనల్ హైవేస్ విభాగంలో ఉద్యోగం పొందగా మున్నూరుకాపు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మున్నూరుకాపు కులానికి చెందిన అభిషేక్ ఐఈఎస్‌లో ఉత్తమ ప్రతిభ చూపడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడం గ్రామానికి గర్వకారణమన్నారు. విద్యార్థులు, యువత అభిషేక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ప్రణాళికబద్ధంగా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో నాయకులు తోట భిక్షపతి, సత్యం, వెంకటేశ్వర్లు, కొంతం శ్రీను, వేముగంటి సతీష్, మంగు జయప్రకాష్, వేముగంటి నర్సింగం, కట్ల జగన్, తోట వేణు, రమేష్, రాహుల్, రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేష్ నాయక్, తదితరులు

నర్మెట : సేవాలాల్ సేన రాష్ట్ర మహా సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ నాయక్, మండల అధ్యక్షుడు ధరావత్ రమేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ, గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9న ఈ మహా సభను బాబు జగ్జీవన్ రామ్ భవన్, సరూర్ నగర్‌లో నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుమన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు రమేష్ నాయక్, సురేష్, కిష్టయ్య, శంకర్, యాకూబ్, రవీందర్, తిరుపతి, అనిల్, రాజన్న, రాయుడు, చిన్న నర్సింహా, వెంకటేష్, సంతోష్, రమేష్, వీరేందర్, నరేష్ పలువురు పాల్గొన్నారు.

'కబడ్డీలో గుర్తింపునకు కృషిచేస్తా'


కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

రఘునాథపల్లి : రాష్ట్రంలోనే జనగామ జిల్లాను కబడ్డీ క్రీడలో ముందంజలో నిలిపేందుకు కృషిచేస్తానని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీతో పాటు ఆయా మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా అధ్యక్షుడిగా రఘునాథపల్లికి చెందిన కుమార్‌గౌడ్‌ను, జిల్లా కమిటీ చైర్మన్‌గా పోగుల సారంగపాణిని (ఖాగల్లు) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, ఉద్దెమారి రాజ్‌కుమార్, మోహన్‌రావు, రాజన్న, అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తోటకూరి గట్టయ్య, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వెంకటేశ్వర్లు, కుమార్, మౌనిక, సందీప్, సురేష్, కోశాధికారిగా ఉప్పలయ్య, మెంబర్లుగా శ్రీకాంత్‌గౌడ్, శ్రీకాంత్, అస్లాం పాషా, చందు, మహేష్, సురేందర్, రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులను గుర్తించి వారికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అసోసియేషన్ అబ్జర్వర్ పూల నాగయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలిపింక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాస్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

వేతనాలు తక్షణమే చెల్లించాలి

బచ్చన్నపేట : గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా నాయకుడు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జీపీ సిబ్బందిని పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన సిబ్బందికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే ఈ నెల 30న చలో హైదరాబాద్‌కు జీపీ ఉద్యోగులు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని తెలిపారు.

రైతుకు పాము కాటు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని చంద్రుతండాకు చెందిన రైతు బానోత్ యాదగిరి తన వ్యవసాయ పొలం వద్ద పాముకాటుకు గురయ్యాడు. యాదగిరి ఆదివారం ఉదయం చంద్రుతండాలోని తన పొలం వద్ద నాట్లు వేశాడు. అనంతరం పొలం గట్టు పక్కన ఉన్న గడ్డివాము వద్ద పనిచేస్తుండగా అతడి కాలివేలికి పాముకాటు వేసింది. గమనించిన అతను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లగా డాక్టర్లు వైద్యం చేస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం

దేవరుప్పుల : గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటు అందిస్తామని ప్రముఖ వైద్యుడు కల్నల్ మాచర్ల భిక్షపతి అన్నారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో ఆదివారం ప్రముఖ చిందు యక్షగాన కళాకారులు, పద్మ శ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య ఆధ్వర్యంలో జనగామ ఆదిత్య ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలు విభాగాల ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో 200 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను సమ్మయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

దేవరుప్పుల : మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆదివారం ఎస్సై ఊర సృజన్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో తప్పులు చేసిన వారు ప్రస్తుతం మారి తమ కుటుంబాలతో పాటు సమాజ హితం కోసం పని చేయాలన్నారు. రౌడీషీటర్లుగా ఉన్న వ్యక్తులు ఇకపై ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సృజన్ కుమార్‌ను సన్మానించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మన్ కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

చిల్పూరు : కేంద్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అన్నారు. మండలంలోని వంగాలపల్లిలో ఆదివారం మండల కన్వీనర్, కోశాధికారి కాదుగాయ రమేశ్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు పీఎం నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మొబైల్‌లో వీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ప్రజలకోసం ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నా వాటిపై ప్రచారం చేయక పక్కదారి పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరూరి ప్రణీతప్రదీప్, బొమ్మినేని తిరుపతిరెడ్డి, నూనె సదానందం, అర్కాల రవి, పాలబోయిన జోగులు, మారబోయిన రమేష్, సాదం భీమన్న తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్‌తో మంచి సందేశం

జఫర్‌గఢ్ : మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు మంచి సందేశాన్నిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలు చేస్తున్న అనేక గొప్ప విషయాలను నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి తెలియజేసేలా ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది ఇతరులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


స్టేషన్‌ఘన్‌పూర్: గురువులతో పూర్వ విద్యార్థులు


చిల్పూరు: శ్రీపతిపల్లిలో..


పాలకుర్తిలో..

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 31 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న బాల్య స్నేహితులు తాము చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకుని చిననాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. కరచాలనాలు, ఆలింగనాలు చేసుకుంటూ ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎండీ సాజిద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు మల్లేశం, రాములు, అంజయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–85 సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహచర విద్యార్థి మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాళేశ్వరం ఇంజనీర్ చిట్యాల యాకయ్య, మాజీ ఎంపీటీసీ పుష్పలీల, చారగొండ్ల సదానందం తమ గురువులు వాసుదేవ్, శేషయ్య, పాపయ్యను ఘనంగా సన్మానించారు.

శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010–11లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు అరుణాదేవి, ప్రతాప్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కొంరయ్య, కళ్యాణిలను విద్యార్థులు నాగరాజు, ప్రశాంత్, నాగరాజు, శేఖర్, ప్రవీణ్, మంగు, ప్రసన్న, అశ్విని, రమ్య, లావణ్య సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మభిక్షం

జనగామ రూరల్ : విద్యార్థి సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తగ్గించినందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు ఎస్‌ఎఫ్‌ఐ పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారన్నారు. ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి ధర్మభిక్షంపై ఎస్సై శ్వేత అక్రమంగా కేసులు నమోదు చేశారన్నారు. ప్రజాపాలన అంటూ విద్యార్థి సంఘాల నేతలపై తప్పుడు కేసులు పెట్టడం, నిర్బంధం అమలు చేయడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు లవకుమార్, సాగర్, మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ప్యానల్‌గా ఎన్నికల్లో పాల్గొనాలి



జనగామ : యూత్ కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశానుసారం ఆదివారం యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్‌లో వివిధ పదవుల కోసం పోటీ చేస్తున్న నాయకులను ఉద్దేశించి శివరాజ్ మాట్లాడుతూ అధిష్టానానికి అనుగుణంగా అందరం కలసికట్టుగా ఒకే ప్యానల్‌గా ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్ కృష్ణన్, జిల్లా బాధ్యులు చెట్కూరి కమలాకర్, దాసరి క్రాంతి, కర్క సంతోష్ రెడ్డి, గంధమల్ల కమలాకర్, దాసరి శ్రీకాంత్, రాజేష్, అనిల్, ప్రకాశ్, సన్నీ, దాసు, నారాయణ, వెంకట్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.